సాక్షి అనంతపురం

గురువారం । 21 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట కిలో రూ.42

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.42 పలికింది. కనిష్టం రూ.34, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అవసరమైన మేరకే ఎరువులు వాడాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



డీసీఎంఎస్ ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

కళ్యాణదుర్గం/ కళ్యాణదుర్గం రూరల్: అవసరమైన మేరకే పంటలకు రసాయన ఎరువులు ఉపయోగించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. బుధవారం కళ్యాణదుర్గం పట్టణంలోని డీసీఎంఎస్ ఎరువుల గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక రైతులతో మాట్లాడారు. రైతు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బయటి మార్కెట్ కంటే డీసీఎంఎస్‌లో ఎరువులు తక్కువ ధరతో లభిస్తాయని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి సాగును అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్ కంబదూరు మండల పరిధిలోని చెన్నంపల్లిలో జవహర్ నవోదయ విద్యాలయం కోసం భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ వసంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రతన్ టాటా ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్‌ను బుధవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ హబ్‌లో ఏర్పాటు చేసిన ఆవిష్కరణలను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, పలు ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యూజీ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత ఓ ప్రకటన విడుదల చేశారు.బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ నెల 26 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

రైల్వే డివిజన్‌ను అభివృద్ధి పట్టాలపై నడుపుదాం



మాట్లాడుతున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజన్‌ను అభివృద్ధి పట్టాలపై నడపడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో కలిసి గుంతకల్లు రైల్వే డివిజన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. రేణిగుంట–గుంతకల్లు సెక్షన్‌లో ప్రత్యేక రైలులో పర్యటిస్తూ తనిఖీ చేశారు. సాయంత్రం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో రివ్యూ మీటింగ్‌లో జీఎం మాట్లాడారు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేడి పాలు ముక్కులో పడి చిన్నారి మృతి



మృతి చెందిన శర్విల్ రెడ్డి

గుత్తి: వేడి పాలు ముక్కులో పడి చిన్నారి మృతి చెందిన ఘటన పట్టణంలో విషాదం నింపింది. వివరాలు.. స్థానిక కోట వీధిలో నివసిస్తున్న ప్రతాప్ రెడ్డి, మేనక దంపతులకు ఇద్దరు మగ పిల్లలు (కవలలు) సంతానం. కుమారులను తల్లిదండ్రులు ఎంతో మురిపెంగా పెంచుకుంటున్నారు. బుధవారం ఇంట్లో పెద్ద కుమారుడు (15 నెలలు) శర్విల్ రెడ్డి గిన్నెలో ఉన్న వేడి పాలు తీసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వేడి పాలు చిన్నారి ముక్కు, నోట్లో పడ్డాయి. దీంతో ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటున్న శర్విల్ రెడ్డిని వెంటనే తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక చిన్నారి మృతి చెందాడు. బిడ్డ మృతదేహం వద్ద తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మాఫియా గుప్పిట్లో రేషన్

పేదల కోసం ప్రభుత్వాలు అందిస్తున్న బియ్యాన్ని కొందరు కొట్టుకెళ్తున్నారు. మాఫియా అవతారమెత్తి రూ. కోట్లు గడిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలియదా? అంటే తెలుసనే చెప్పాలి. మామూళ్ల మత్తులో కళ్లుమూసుకున్నారనే విమర్శలున్నాయి.

- 'పుష్ప' సినిమాలో ఎర్రచందనం తరహాలో బియ్యం దందా
- ఉమ్మడి అనంతలో 'ఆర్కే' పేరు చెబితే హడల్
- విజిలెన్స్ నుంచి పోలీసు వరకూ చిట్టీ చూపిస్తే వాహనం వదలాల్సిందే
- ఉమ్మడి అనంతకు వచ్చే బియ్యంలో సగం కర్ణాటకకే
- మామూళ్ల మత్తులో విజిలెన్స్, పోలీసులు



ఇటీవల యాడికి మండలకేంద్రంలో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు వచ్చిన దగ్గర నుంచి పీడీఎస్ బియ్యం మాఫియా పేట్రేగిపోతోంది. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలకు వచ్చే బియ్యంలో సగం బయటి రాష్ట్రాలకే వెళుతోంది. దీనివెనుక మాఫియా డాన్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. వీరికి టీడీపీ ఎమ్మెల్యేలు సహకరిస్తున్నట్టు సమాచారం. ప్రతి ఇరవై ఇళ్లకు ఒకరు సేకరించి ఒకచోటకు చేర్చేటంత నెట్‌వర్క్ ఉందంటే ఈ వ్యవహారం ఎంతవరకూ వెళ్లిందో అంచనా వేయొచ్చు.

ఆరితేరిన 'ఆర్కే'..

బియ్యం అక్రమ రవాణా అంటే రామకృష్ణ (ఆర్కే) పేరు వినిపిస్తుంది. ఇతనిది పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి. బియ్యం అక్రమ రవాణాకు ఇతనే డాన్. అనంతపురంలో టీవీ టవర్ వద్ద, రాప్తాడు నియోజకవర్గం కందుకూరు, ఉరవకొండ నియోజకవర్గం కూడేరు, ధర్మవరం నియోజకవర్గంలో మరో ఏరియా ఇలా సుమారు 15 వరకూ భారీ డంప్‌లు ఏర్పాటు చేసుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. గతంలో వ్యాపారులు సేకరించిన బియ్యాన్ని నేరుగా బంగారుపేట, పావగడకు తీసువెళ్లేవారు. ఇప్పుడు ఎవరైనా ఇలా బియ్యాన్ని సేకరిస్తే ఆర్కేకే ఇవ్వాలి. ఈయన కాకుండా సుబ్రమణ్యం శెట్టి, సుబ్బు, మాధవి, ఆచారి లాంటి వాళ్లు దందాలో భాగస్వాములుగా ఉన్నారు. 'పుష్ప' సినిమాలో ఎర్రచందనం తరహాలో బియ్యం పక్కరాష్ట్రాలకు తరలిస్తున్నారు.

అధికారులతో మిలాఖత్

ఉమ్మడి అనంతపురం జిల్లాకు నెలకు 18,500 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం వస్తుండగా.. 9 వేల మెట్రిక్ టన్నులు బయటి రాష్ట్రాలకే అక్రమ రవాణా అవుతున్నాయి. విజిలెన్స్, పోలీసు, సివిల్ సప్లయిస్ ఇలా మూడు విభాగాల అధికారులకు బియ్యం అక్రమరవాణా డాన్‌లు మామూళ్లు ఇస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ముట్టజెబుతున్నారు. ప్రతి చెక్‌పోస్టుకూ నెలకు రూ.1.50 లక్షలు ఇస్తున్నట్టు తేలింది. ఇక విజిలెన్స్ వారికి నియోజకవర్గానికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకూ ఇస్తున్నట్టు సమాచారం. దీంతోనే ఎన్ని చెక్ పోస్టులు పెట్టినా బియ్యం సరిహద్దులు దాటిపోతున్నాయి.

డ్రైవర్లు కేసుల్లో.. డాన్‌లు కలుగుల్లో

లబ్ధిదారులతో ఏజెంట్లు కేజీ రూ.18కి కొని, పెద్ద వ్యాపారులకు రూ.22కు అమ్ముతారు. వీటిని బంగారుపేట, పావగడల్లోని రైస్‌మిల్లుల్లో పాలిష్ చేసి కేజీ రూ.28 నుంచి రూ.30కి ముంబైతో పాటు పలు నగరాలకు తరలిస్తారు. ఇలా ఏటా ఇలా రూ. వందల కోట్ల వ్యాపారం జరుగుతోంది. వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి.. ఈ మూడు జిల్లాల బియ్యమూ కర్ణాటకకు వెళుతున్నాయి.

ఈ ఏడాది బుక్ అయిన కొన్ని బియ్యం కేసులు

జిల్లా	తేదీ	సీజ్ అయిన బియ్యం
శ్రీ సత్యసాయి	జనవరి 20	34 క్వింటాళ్లు
అనంతపురం	ఫిబ్రవరి 20	130 క్వింటాళ్లు
అనంతపురం	మే 5	315 క్వింటాళ్లు
అనంతపురం	జూన్19	134 క్వింటాళ్లు
అనంతపురం	జులై 3	99 క్వింటాళ్లు
శ్రీ సత్యసాయి	జులై18	235 క్వింటాళ్లు
అనంతపురం	ఆగస్టు 4	100 క్వింటాళ్లు

అయితే, రోజూ ఎక్కడో చోట విజిలెన్స్ అధికారులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు వార్తలొస్తాయి. బియ్యం రవాణా చేసే వాహనాల డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తారు. ఆ తర్వాత ఏమీ ఉండదు. కానీ అసలు డాన్‌లు ఎవరు, దీని వెనకాల ఏం నడుస్తోంది అన్నది పోలీసులు గానీ, విజిలెన్స్ కానీ విచారణ చేయడం లేదు. ఏదో ఫైన్‌లు రాయడం, అప్పటి కప్పుడు వదిలేయడం చేస్తున్నారు.

అనంతపురం జిల్లా వివరాలు..

జిల్లాలో రైస్ కార్డులు	6,60,330
చౌకదుకాణాలు	1,645
నెలకు వచ్చే బియ్యం	9,967 మెట్రిక్ టన్నులు

శ్రీ సత్యసాయి జిల్లా వివరాలు..

జిల్లాలో రైస్ కార్డులు	5,76,632
చౌకదుకాణాలు	1,367
నెలకు వచ్చే బియ్యం	8,600 మెట్రిక్ టన్నులు

తొలి రోజు ఇద్దరు.. రెండో రోజు ముగ్గురు

- జెడ్పీ శిక్షణ తరగతులకు స్పందన కరువు
- అధికారులకూ పట్టని వైనం



శిక్షణకు హాజరైన ముగ్గురు మహిళా ప్రజాప్రతినిధులు... అధికారులు లేక బోసిపోతున్న వేదిక

అనంతపురం సిటీ: అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణకు మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీల నుంచి స్పందన కరువైంది. మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని జెడ్పీ అధికారులు నిర్ణయించారు. జెడ్పీ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు ఉంటాయని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని మహిళా ప్రజాప్రతినిధులకు కబురు పంపారు. అందరూ వస్తారని భావించినా తొలి రోజు మంగళవారం కేవలం ఇద్దరు మహిళా జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. బుధవారం ముగ్గురు (ఇద్దరు జెడ్పీటీసీలు, ఒక ఎంపీపీ) మాత్రమే వచ్చారు. శిక్షణ తరగతులకు కనీసం 60 మంది వస్తారని ఊహించి, ఆ మేరకు భోజనాలు తెప్పించారు. అయితే ప్రజాప్రతినిధుల నుంచి స్పందన సరిగా లేకపోవడంతో భోజనాలన్నీ వృథా అయ్యాయి. ఆ వచ్చిన వారు కూడా ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఇప్పటికే తమ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కాగా, మరో ఏడాది కాలం మాత్రమే మిగిలి ఉందని, నాలుగేళ్లుగా లేని శిక్షణ చివరి ఏడాదిలో ఎందుకో అధికారులకే తెలియాలని పేర్కొన్నారు. కేవలం నిధులు వెనక్కి పోకుండా ఖర్చులు చూపించుకోవడానికే కార్యక్రమం ఏర్పాటు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హడలెత్తుతున్న సబ్ రిజిస్ట్రార్లు

- చెప్పింది చెయ్యకపోతే బదిలీపై వెళ్లిపోతారంటూ ఎమ్మెల్యేల హెచ్చరికలు
- పెద్ద రిజిస్ట్రేషన్ వస్తే తమకు తెలియజేయాలని హుకుం
- ప్రతినెలా మామూళ్లివ్వాలని కొంతమంది ఎమ్మెల్యేల అల్టిమేటం
- విలవిలలాడుతున్న సబ్‌రిజిస్ట్రార్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'పచ్చ' నేతల దెబ్బకు ఉమ్మడి జిల్లాలో సబ్ రిజిస్ట్రార్లు బెంబేలెత్తుతున్నారు. అసలే రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయి అల్లాడుతుండగా తాజాగా ఎమ్మెల్యేల ఒత్తిడి ఎక్కువైపోయిందంటూ వాపోతున్నారు. తాము చెప్పినట్టు రిజిస్ట్రేషన్లు చెయ్యకపోతే శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పెద్ద రిజిస్ట్రేషన్లు తమకు తెలియకుండా చేయకూడదని చెబుతున్నారు.

పర్సెంటేజీలు ముట్టజెబితేనే..

ఎక్కడైనా కొద్దో గొప్పో బిల్డర్లు స్థలాలు లేదా భూములు కొని రిజిస్ట్రేషన్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కోటి రూపాయలకు మించి ఎలాంటి రిజిస్ట్రేషన్ వచ్చినా ముందుగా ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వాలి. స్వయంగా కొన్ని చోట్ల సబ్‌రిజిస్ట్రార్‌లే 'ఎమ్మెల్యేను కలిసి రండి' అని కొనుగోలుదారుడికి చెబుతున్నారంటే పరిస్థితి అంచనా వేయొచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. మున్సిపాలిటీల పరిధిలో పెద్ద పెద్ద భవనాలకు రిజిస్ట్రేషన్లు జరగాలన్నా ఎమ్మెల్యేల అనుమతి ఉండాల్సిందేనని సబ్‌రిజిస్ట్రార్లు చెబుతున్నారు.

అక్కడ భారీగా ఒత్తిళ్లు..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ప్రధానంగా కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్టు వాపోతున్నారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్,కదిరి,కళ్యాణదుర్గం, రాప్తాడు, తాడిపత్రి ప్రాంతాల్లో ఎక్కువ ఇబ్బందులున్నట్టు చెబుతున్నారు. కొన్ని చోట్ల ఒక సారి రిజిస్ట్రేషన్ అయిన భూములను కూడా రెండో సారి చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఒత్తిళ్ల కారణంగానే ఇటీవల అనంతపురం నగరంలో 'అస్రా' కంటి అద్దాల షాపు రిజిస్ట్రేషన్ రెండో సారి జరిగినట్టు తెలిసింది.

కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతా అడ్డగోలుగా..

కదిరిలో ముడుపులు లేనిదే ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగడం లేదు. విచిత్రమేమంటే పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించిన మూడు మండలాలు కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి వస్తాయి. కానీ ఈ మూడు మండలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పుట్టపర్తి ఎమ్మెల్యే చెప్పినట్టు జరగడం లేదు. కదిరి ఎమ్మెల్యే చెబితేనే పనవుతుందని అక్కడి టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ధర్మవరం, శింగనమల నియోజకవర్గాల్లోనూ ఖరీదైన భూములైతే ప్రజాప్రతినిధుల చేయి తడిపాకే పనవుతోంది. లేదంటే సబ్‌రిజిస్ట్రార్ కొర్రీలేసి జాప్యం చేస్తున్నారు. ఎమ్మెల్యేల ఒత్తిడి కారణంగా సబ్‌రిజిస్ట్రార్లు కూడా వినియోగదారుల నుంచి పిండుకుంటున్నారు. దీంతోనే ఏడాదిలో ఒక్క సబ్ రిజిస్ట్రార్ అయినా ఏసీబీకి పట్టుబడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఎమ్మెల్యేల ఒత్తిడి ఉన్నట్టు సబ్‌రిజిస్ట్రార్లు చెబుతుండడం గమనార్హం.

అంతర్ జిల్లా టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: ఒకే యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న భార్య,భర్తలు స్పౌజ్ కింద, అలాగే మ్యూచువల్ (పరస్పర బదిలీలు) బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడు/హెడ్‌మాస్టర్ ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా వివరాలు, బదిలీ కావాల్సిన జిల్లా వివరాలను డీఎస్సీ ఏపీ ద్వారా ధ్రువీకరించుకోవాలి. ఈ ప్రకారం కొత్త ప్రొఫార్మాలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత లేదా వైద్య కారణాలపై బదిలీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపకూడదని స్పష్టం చేశారు. ఈ బదిలీలు జిల్లాల మధ్య మాత్రమే జరుగుతాయని పేర్కొన్నారు. ఒకే యాజమాన్యంలో పని చేస్తున్న వారికి మాత్రమే వర్తిస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. 2025 జూలై 31 నాటికి కనీసం రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు అర్హులు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న వారు అదే యాజమాన్యంలో బదిలీకి అర్హులని పేర్కొన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల సమ్మతిపత్రం తప్పనిసరిగా జత చేయాలి.



దరఖాస్తు ఇలా...

లీప్‌యాప్ (ఆన్‌లైన్)లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసిన తర్వాత ప్రింట్ తీసుకుని సంతకం చేసి సంబంధిత హెచ్ఎం/ఎంఈఓ/డీవైఈఓకు అందజేయాలి. ఆయా అధికారులు అన్ని సర్టిఫికెట్లు పరిశీలించి నిర్ధారణ చేసి డీఈఓకు నివేదించాలి. ఒకసారి మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొత్త జిల్లాలకు వెళ్లేటప్పుడు సీనియార్టీ కోల్పోతారు. అక్కడ చివరి ర్యాంకులో చేర్చుతారు. ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 22 నుంచి 25 వరకు హెచ్ఎంలు/ఎంఈఓలు/డీవైఈఓలు పరిశీలిస్తారు. 23 నుంచి 26 వరకు డీఈఓ కార్యాలయంలో పరిశీలిస్తారు. 27న పాఠశాల డైరెక్టర్‌కు నివేదిస్తారు. 28,29 తేదీల్లో డైరెక్టర్ కార్యాలయంలో పరిశీలించి నిర్ధారిస్తారు. 30న ప్రభుత్వానికి నివేదించనున్నారు. ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన తర్వాత బదిలీ ఉత్తర్వులు జారీ అవుతాయి.

రమణీయం.. రథోత్సవం

వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో బుధవారం ఆదిచెన్నకేశవ స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారిని ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చి ఉత్సవం ప్రారంభించారు. రథాన్ని లాగుతూ భక్తులు తన్మయత్వం పొందారు. స్వామివారి నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి.

– వజ్రకరూరు



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి రథం



రథోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) ఆదిచెన్నకేశవస్వామి మూలవిరాట్

టోకెన్లు ఇచ్చి ఉత్త చేతులు చూపుతారా?



ఒక్క బస్తా యూరియా అయినా ఇవ్వండి సార్ అంటూ కన్నీళ్లు పెట్టుకున్న మహిళా రైతు ఓబుళమ్మ... నిస్సహాయ స్థితిలో అధికారి



అనంతపురం డీసీఎంఎస్ కార్యాలయ ప్రధాన గేటు మూసివేసి ధర్నా చేస్తున్న రైతులు

- యూరియా పంపిణీలో ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం
- డీసీఎంఎస్ కార్యాలయానికి తాళాలు వేసి ధర్నా

అనంతపురం అగ్రికల్చర్: యూరియా కోసం టోకెన్లు ఇచ్చి ఉత్త చేతులు చూపుతారా అంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం బుధవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 7 గంటలకే బారులు తీరారు. అయితే, అధికారులు మాత్రం స్టాకు లేదంటూ చేతులెత్తేశారు. కనీసం ఒక బస్తా యూరియా అయినా ఇవ్వాలని అనంతపురం రూరల్ మండలం కామారుపల్లికి చెందిన మహిళా రైతు ఓబుళమ్మ కన్నీళ్లు పెట్టుకున్నా స్టాకు లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో కడుపు మండిన రైతులు నిరసనకు దిగారు. ఎరువులు అమ్మే ఇంత పెద్ద ఆఫీసుకే యూరియా తెప్పించకపోవడమేమిటంటూ బీఎం విజయభాస్కర్, ఏబీఎం సత్యనారాయణరెడ్డి, ఏఓ సుధాకర్‌రెడ్డిని నిలదీశారు. అధికారులు, సిబ్బందిని బయటకు పంపి కార్యాలయానికి తాళాలు వేశారు. అనంతరం ప్రధాన గేటు ముందు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి వెంకటకుమార్ అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. టోకెన్లు ఇచ్చిన వారికి యూరియా ఇస్తామని, గురువారం నుంచి ఎక్కడిక్కడ రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా అవుతున్నందున, ఇక్కడకు రావాల్సిన అవసరం లేదని నచ్చజెప్పారు. కలెక్టర్, జేడీఏ ఆదేశాల మేరకు మండలాల్లోనే ఒక ఆర్ఎస్‌కేకు యూరియా సరఫరా చేస్తారని, సంబంధిత మండల వ్యవసాయ అధికారిని సంప్రదిస్తే యూరియా అందేలా చూస్తారన్నారు. అనంతపురం రూరల్‌కు సంబంధించి నారాయణపురంలో తీసుకోవచ్చన్నారు. దీంతో రెండు గంటల తర్వాత రైతులు నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

క్లుప్తంగా

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దండి



మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ

పుట్టపర్తి అర్బన్: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) సీఈఓ వాకాటి కరుణ ఆదేశించారు. వెలుగు కార్యాక్రమాలపై బుధవారం పుట్టపర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా వెలుగు సిబ్బందితో ఆమె సమీక్షించారు. మహిళా సాధికారతకు కృషి చేయాలని, మహిళా సంఘాల్లో లెక్కల్లో కచ్చితత్వం ఉండేలా కృషి చేయాలని సూచించారు. మహిళల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి, వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ తో పాటు ఇతర రుణాలు అందించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఉన్నతి హెచ్‌డీ డైరెక్టర్ శివశంకరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీలు నరసయ్య, శైలజ, ఉమ్మడి జిల్లా డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శాంతి భవన్‌లో కలెక్టర్ చేతన్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా విషయాలపై సుమారు గంట పాటు చర్చించారు.

వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి

- విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్: విద్యుత్ వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగినప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరువ అవుతామని ఆ శాఖ సీఎండీ సంతోష్‌రావు అన్నారు. విద్యుత్ వినియోగదారులతో ఎలా మెలగాలనే అంశంపై జేఎన్‌టీయూ ఆడిటోరియంలో బుధవారం ఆ శాఖ అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు సకాలంలో సేవలు అందించి వారి నుంచి రెవెన్యూ రాబట్టేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుత వర్షకాలంలో వినియోగదారులు ఫోన్ చేసిన వెంటనే స్పందించి, విద్యుత్ అంతరాయం లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఎం వరకుమార్, ఎస్ఈ శేషాద్రి శేఖర్‌తోపాటు పలువురు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయలసీమ కవితా పోటీలు

అనంతపురం కల్చరల్: రాయలసీమ సమాజం, జీవనం, సంస్కృతి నేపథ్యంగా దీర్ఘ కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు నవంబరు 1వ తేదీలోపు తమ కవితలను పంపాలని కోరారు. విజేతకు రూ.15 వేల నగదు పురస్కారాన్ని అందజేయనున్నామన్నారు. పూర్తి వివరాలకు 99639 17187 లో సంప్రదించాలని కోరారు.

సర్వజనం.. వేదనాభరితం



వైకల్య ధ్రువీకరణ కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో వేచి ఉన్న దివ్యాంగులు

దివ్యాంగుల పింఛన్లు ఆగిపోయాయి.. చిన్న చిన్న కారణాలతో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా వేలల్లో లబ్ధిదారుల పింఛన్లను నిలుపుదల చేసే చర్యలకు కూటమి సర్కార్ తెర దీసింది. ఈ మేరకు నోటీసులు జారీ కావడంతో ఏం జరిగిందో.. ఏం జరుగుతుందో తెలియక దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. తమ వైకల్యాన్ని ధ్రువీకరించుకునేందుకు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాల కోర్చి బుధవారం సర్వజనాస్పత్రికి పరుగున చేరుకున్నారు. దీంతో సర్వజనాస్పత్రిలో వేదనాభరిత దృశ్యాలు చూపరుల హృదయాలను కదిలించాయి. సీఎం చంద్రబాబు ఏ పని చేసినా దానికో లెక్క... ఆ లెక్కలో పక్కాగా మోసం, కుట్ర దాగి ఉంటుందనేందుకు దివ్యాంగ పింఛన్ల తొలగింపే నిదర్శనం.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం



కంబదూరు మండలం కొత్తూరు గ్రామం నుంచి వచ్చిన నరేష్



గుంతకల్లు నుంచి వచ్చిన కలాంబాషా



అయ్యవారిపల్లి నుంచి కొడుకు గోవర్ధన్‌ను తీసుకొచ్చిన తల్లి



మంచాన ఉన్నా తప్పట్లేదు: రాయదుర్గం మండలం హనుమాపురం నుంచి వచ్చిన యన్నప్ప



కుందుర్పి మండలం నుంచి రమేష్‌ను అద్దె కారులో తీసుకొచ్చిన కుటుంబసభ్యులు



కూడేరు నివాసి మంగమ్మను కుర్చీలో తీసుకొస్తున్న దృశ్యం

చీనీలో సమగ్ర యాజమాన్యం



బుక్కరాయసముద్రం: చీనీ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి తెలిపారు. గత ఏడాది టన్ను చీనీ ధర రూ. 90 వేలు నుంచి రూ.1.10 లక్షల వరకూ పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.25 వేలతో అమ్ముడుపోతోంది. ఈ నేపథ్యంలో చీనీ సాగులో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను 'సాక్షి'కి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వివరించారు.

- చీనీ సాగులో ప్రధానంగా మొక్క ఎంపిక చాలా ముఖ్యం. మొక్క ఎంపిక సరైనది కాకపోయినా, సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించకపోయినా, విపరీతంగా రసాయనిక మందులు వినియోగించినా, సూక్ష్మ పోషకాలు లోపించినా, సరైన నీటి యాజమాన్యం లేకపోయినా వేరు కుళ్లు, బంక తెగుళ్లు, నల్ల మంగు తదితర చీడ పీడలు ఆశించే అవకాశముంది.
- రంగాపూర్ నిమ్మ వేరు మీద 15 సెంటీమీటర్ల ఎత్తులో అంటు కట్టి, చీడపీడలు ఆశించని 6 నెలల వయసున్న మొక్కలు ఆమోదం పొందిన నర్సరీ నుంచి సేకరించుకోవాలి. 1 మీటరు లోతు గుంత తీసి 20 కిలోల పశువుల ఎరువు, 100 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి, 2 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రాముల మిథైల్ ఫెరాథియాన్ కలిపి మొక్క నాటడానికి 15 రోజుల ముందు వేసి నీరు పెట్టాలి. నేల మట్టం నుంచి 15 సెంటీమీటర్లు ఎత్తులో అంటు కలయిక భాగం ఉండేలా నాటుకోవాలి.
- నేలలో కర్బన శాతాన్ని పెంచడానికి 25 కిలోల జనుమును మొక్కల మధ్య అంతర పంటగా వేయాలి. 50 శాతం పూత వచ్చిన తరువాత జనుమును కలియ దున్నాలి. 25 శాతం పశువుల ఎరువు, 25 శాతం చెక్క, 50 శాతం సేంద్రీయ ఎరువులను వేయాలి. నత్రజని, పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా వేసుకోవాలి. కాయ పెరిగే సమయంలో వేసుకున్నట్లయితే మొక్కకు పోషకాలు పెరిగి మంచి దిగుబడి సాధించవచ్చు. 500 గ్రాముల యూరియా, 250 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం ఎంతో మంచిది.
- లేత ఆకులు విచ్చుకున్న దశలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు సూక్ష్మధాతు మిశ్రమాన్ని పిచికారీ చేయాల్సి ఉంటుంది. జింక్ సల్ఫేటు 500 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేటు 200 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేటు 200 గ్రాములు, బోరాన్ 100 గ్రాములు, యూరియా 1కిలో చొప్పున 100 లీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పూత, పిందె దశలో ఉన్నప్పుడు వేర్లు ఉన్న ప్రాంతాన్ని కదిలించరాదు. డ్రిప్పు ద్వారా నీటి తడులను సక్రమంగా ఇవ్వాలి. 9 లీటర్ల నీటికి 2 మి.లీ. ప్లానాఫిక్స్ కలిపి పూత, పిందె దశలో పిచికారీ చేయాలి. ఒకవేళ తెగుళ్ల వలన పిందె రాలుతుంటే లీటరు నీటికి కార్బండజిమ్ 1 గ్రాము కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- కాయ సైజు పెరగడానికి నిమ్మ కాయ సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున పొటాషియం నైట్రేట్ 13.0.45 కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. కాయలో నునుపుదనాన్ని పెంచడానికి లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేటు ఆఫ్ పొటాష్ కలిపి కాయ కోయడానికి నెల రోజుల ముందు పిచికారీ చేయాలి.

నిధుల్లేక నిస్తేజం!

- ఆగిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- ఏడాదిగా కుంటుపడిన పల్లె పాలన

జిల్లాలో గ్రామ పంచాయతీలు	577
గ్రామ సచివాలయాలు	663
అందాల్సిన ఆర్థిక సంఘం నిధులు	రూ.30 కోట్లు

రాయదుర్గం: నిధుల్లేక గ్రామ పంచాయతీలు నిస్తేజంలో పడ్డాయి. ఐదు నెలలుగా పైసా జమ కాకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల ఊసే లేకపోవడంతో సర్పంచులు పారిశుధ్య పనులకే పరిమితమవుతున్నారు. వీటికి సైతం సొంత డబ్బు వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఎదురుచూపునకే పరిమితం

జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఈ ఏడాది మార్చి 31 తర్వాత ఆగిపోయాయి. ఈ లెక్కన 577 పంచాయతీలకు రూ.30 కోట్లకు పైగా నిధులు జమకావాల్సి ఉంది. నిధులు జమకాక, పనులు చేపట్టక సర్పంచులు సతమతమవుతున్నారు. 90 శాతం గ్రామ పంచాయతీలకు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే సర్పంచులుగా గెలుపొందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అడుగడుగునా సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నీ పంచాయతీల్లోనూ కూటమి నాయకులే అధిపత్యం చెలాయిస్తుండడంతో సొంతంగా ఏ పని చేయలేని దుస్థితిలో ఉంటున్నారు.



చిన్నపాటి వర్షానికే కాలు పెట్టలేని స్థితిలో ఉన్న ఉద్దేహాళ్ దళిత కాలనీ

పన్నులపైనే ఆధారం

గ్రామ జనాభా ఆధారంగా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రతి నెలా ఎస్ఎఫ్‌సీ నిధులతో పాటు మూడు నెలలకోసారి 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం సమకూరుస్తూ ఉంటుంది. జిల్లాలోని 577 గ్రామ పంచాయతీల్లో 3.90 లక్షల గృహాలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీ పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి పథకాల మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్, ట్రాక్టర్ నిర్వహణ, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు తదితరాల ఖర్చులు పంచాయతీలే భరిస్తున్నాయి. అయితే 15 ఆర్థిక సంఘం నిధులు అందక ఇంటి పన్ను, కొళాయి పన్నులపైనే ఆధారపడాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.18.8 కోట్లు ఇంటి పన్ను లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ రూ.15.3 కోట్లు వసూలైంది. మరో రూ.3.5 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

తాండవిస్తున్న పారిశుధ్యం

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో అపరిశుభ్రత పేరుకుపోతోంది. తడి ఆరక వీధులన్నీ బురదమయంగా మారాయి. కాలు ఎక్కడ పెట్టాలో తెలియని స్థితిలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఖజానాలో డబ్బుల్లేక సర్పంచులు సొంత డబ్బును వెచ్చించాల్సి వస్తోంది.

రూ.3 లక్షలు ఖర్చుచేశా



గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు జమకాలేదు. దీంతో అత్యవసర పనులకు గాను ఇప్పటి వరకూ రూ.3 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశాను. 15వ ఆర్థిక సంఘం నిధులు జమ అయితే ఊరట లభిస్తుంది.

– జి.చంద్రకళ, బీఎన్‌హళ్లి సర్పంచ్, రాయదుర్గం మండలం

ఖాతాలో జీరో ఉంది



15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పోవడంతో గ్రామ పంచాయతీ ఖాతాలో జీరో బ్యాలెన్స్ ఉంది. వీధి బల్బులు మార్చాలన్నా అప్పు చేయక తప్పడం లేదు. బకాయిలు సకాలంలో విడుదల చేసి గ్రామ పంచాయతీలను ఆదుకోవాలి.

– రమేష్, కేపీదొడ్డి సర్పంచ్, గుమ్మఘట్ట మండలం

త్వరలో జమ చేస్తాం

జిల్లా వ్యాప్తంగా 577 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 కోట్లు జమకావాల్సి ఉంది. ఈ నెల ఆఖరులోపు పంచాయతీ ఖాతాలకు నిధులు జమ అయ్యే అవకాశముంది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న ఇంటి, నీటి పన్నుల నిధుల్ని అత్యవసర పనులకు ఉపయోగించుకునేలా ఆదేశాలు జారీ చేశాం. పారిశుధ్యంపై అన్ని గ్రామ పంచాయతీల్లోనూ స్పెషల్ డ్రైవ్ చేపడతాం.

– నాగరాజునాయుడు, డీపీఓ


కరిగిపోతున్న అక్కమాంబ కొండ



అక్కమాంబ కొండను తవ్వి మట్టిని తరలించడంతో ఏర్పడిన గోతులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ శివారులోని అక్కమాంబ కొండపై టీడీపీ నేతల కన్ను పడింది. ఏకంగా కొండను తవ్వి ఎర్ర మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్ మట్టిని డిమాండ్‌ను బట్టి రూ.3వేల నుంచి రూ.4వేలకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందా రాత్రి సమయంలో జోరుగా సాగుతోంది. టీడీపీ నేతలే అక్రమాలకు తెరలేపడంతో అటుగా అధికారులు సైతం కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా అక్కమాంబ కొండ కరిగిపోతోంది. దీనిపై తహసీల్దార్ భాస్కర్‌ను వివరణ కోరగా... ప్రభుత్వ స్థలాలు, కొండ ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాక, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నూతన మూల్యాంకన విధానం వద్దు : ఏపీటీఎఫ్



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్య పరీక్షల నిర్వహణలో తీసుకొచ్చిన నూతన మూల్యంకన విధానాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మూల్యాంకన విధానం బోధన సమయాన్ని హరించేలా ఉందన్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందన్నారు. అసెస్మెంట్ బుక్లెట్ విధానాన్ని ఉపసంహరించుకొని సాధారణ మూల్యాంకన విధానాన్నే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే చాలామంది ఉపాధ్యాయులకు జూన్, జూలై మాసాల జీతాలు ఇప్పటికీ అందలేదని, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. డీఈఓను కలసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, నాయకులు నరసింహులు, సర్దార్ వలి, వెంకటరమణ, వన్నప్ప, ఈజీ నాగభూషణం, రంగనాయకులు, పుల్లయ్య ఉన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ రాయపరెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు https://iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అనంతరం 27వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలి. 29న కౌన్సెలింగ్ ఉంటుంది. పూర్తి వివరాలకు పని వేళల్లో ఐటీఐ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, సంస్కృతం సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్తి సమాచారానికి 86395 30636 లో సంప్రదించవచ్చు.

యూరియా నిల్వలపై విస్తృత తనిఖీలు



రాప్తాడు మండల పరిధిలో ఉన్న ఎంఎస్ పెయింట్స్ గోదాములో తనిఖీలు చేస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా గత 10 రోజులుగా యూరియా కొరత ఏర్పడటంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. ఈ విషయంపై ఇటీవల కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్ అయ్యారు. ఎందుకు సమస్య ఉత్పన్నమైందో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖతో పాటు రెవెన్యూ, కార్మిక, పరిశ్రమలు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, పోలీసు తదితర శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో తనిఖీలు సాగిస్తున్నారు. వ్యవసాయానికి కాకుండా ఇతరత్రా వాటి తయారీ కోసం ఉపయోగిస్తున్నారా అనే కోణంలో పెయింట్ షాప్స్, డెయిరీలు, లూబ్రికెంట్స్, పీవీసీ పైపులు, సొల్యూషన్ తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఇదిలా ఉంటే, జిల్లా నుంచి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు యూరియా వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరికొందరు ముందస్తుగా పెద్ద ఎత్తున నిల్వ చేసుకున్నట్లు కూడా చెబుతున్నారు. మరికొందరు డీలర్లు ఎంఆర్‌పీకి మించి అమ్ముకునేందుకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.

గిరిజనుడిపై టీడీపీ సానుభూతిపరుడి దాడి



ప్రసాద్‌నాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: మండలంలోని లత్తవరం తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు తులసీనాయక్ దాడి చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. బుధవారం ఉదయం తన పొలానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా ట్రాక్టర్‌పై వస్తున్న తులసీనాయక్ దారి ఇవ్వకుండా అడ్డంగా నిలిపి వేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో తులసీనాయక్ రాయితో దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి.. ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

ఏదో.. వింటే పోలా!



పరిసరాల పరిశుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియపై గ్రామీణుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య శింగనమల మండలం తరిమెల గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ అంశంపై స్థానికుడితో ఆరా తీస్తుండగా బడికెళుతున్న ఓ విద్యార్థి 'పెద్దసార్ ఏదో చెబుతున్నాడు' అంటూ ఆసక్తిగా వింటుండడం అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఈ ఆసక్తికర సన్నివేశాన్ని 'సాక్షి' కెమెరా చిత్రీకరించింది.

– అనంతపురం సిటీ:

'పెట్రోల్ బంకుల్లో ఎప్పటికప్పుడు ఆడిట్'

అనంతపురం: జైళ్ల శాఖ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహిస్తామని జిల్లా ఉప కారాగారాల అధికారి ఈ.అనిల్ బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని పెట్రోల్ బంకులో అక్రమాలు చోటు చేసుకున్న అంశంపై 'జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో అక్రమాలు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. జైళ్ల శాఖ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో విక్రయించే పెట్రోల్‌కు సంబంధించిన వివరాలపై ఎప్పటికప్పుడు ఆడిటింగ్ ఉంటుందన్నారు. ఈ ఏడాది జూన్లో జరిగిన సాధారణ బదిలీల్లో ధర్మవరం సబ్‌జైలు అధికారి బదిలీ అయ్యారని, ఆ సమయంలో ధర్మవరం హెడ్ వార్డెన్‌కు పెట్రోల్ బంక్ బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. ఈ క్రమంలో నగదు తక్కువగా ఉన్నట్లయితే.. సంబంధిత అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



సూచనలిస్తున్న ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత

ఆత్మకూరు: పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణ ఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, నానో వ్యవసాయం, నానో డీఏపీ వాడటం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. జీవన ఎరువులు వాడటంలో మెలుకువలు వివరించారు. భూసార పరీక్ష ఫలితాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వివిధ పంటల్లో మేలైన యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు అక్కమ్మ, అలేఖ్య, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. సత్యనారాయణ రెడ్డి (32) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్యనారాయణరెడ్డి తిరిగి రాలేదు. గ్రామంతో పాటు బంధువులు, తెలిసిన వారిని ఆరా తీసినా ఆచూకీ లభించ లేదు. ఈ క్రమంలో తండ్రి ఈశ్వర్‌రెడ్డి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు



పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఇటీవల ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్లకు (స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్-ఎస్‌సీటీపీసీ) త్వరలో శిక్షణ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో శిక్షణార్థులకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించేందుకు బుధవారం పోలీస్ శిక్షణ కేంద్రాన్ని (డీటీసీ) ఎస్పీ జగదీష్ సందర్శించారు. డీటీసీ పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. శిక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలీసు శిక్షణ కేంద్రంలో చేపట్టవలసిన మరమ్మతు పనులపై ఆరా తీశారు. సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

రాప్తాడు: వినాయక చవితి పండుగ నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రాప్తాడు సీఐ శ్రీహర్ష సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చందాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడరాదన్నారు. ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే వాడాలన్నారు. మద్యం తాగి డ్యాన్స్ చేయడం, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డీఎస్సీ మెరిట్ జాబితా ప్రకటించాలి



మాట్లాడుతున్న కుల్లాయిస్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ మెరిట్ జాబితా పాత విధానంలోనే ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ పోస్టుల భర్తీలో ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుడుతోందన్నారు. ఈ విధానం అనుమానాలు రేకెత్తించేలా ఉందన్నారు. ఎంపికైన వారికి వ్యక్తిగతంగా మెసేజ్‌లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. దొంగ చాటున అభ్యర్థుల జాబితా దాచిపెట్టి లంచాల కోసం ఈ నిర్ణయం తీసుకుంటున్నారా? అని మండిపడ్డారు. గతంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత మెరిట్ లిస్ట్ ఏ కేటగిరీకి ఎన్ని పోస్టులు ఉన్నాయి? ఎన్ని మార్కుల వరకు ఆగిపోతుందనే కటాఫ్ ఇచ్చేవారని గుర్తు చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు నంద కిషోర్, బాబ్జాన్ పాల్గొన్నారు.

టోల్ చెల్లించినా ‘దారి’ద్ర్యమే

నగరం మీదుగా వెళ్తున్న హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్–44) అధ్వానంగా తయారైంది. గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ జాతీయ రహదారిపై నిత్యం వేలలో వాహనాలు అటు బెంగళూరు, ఇటు హైదరాబాద్‌తో పాటు దేశంలో ప్రధాన నగరాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు వేగంగా వచ్చే క్రమంలో గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. రహదారి ఎక్కడికక్కడ దెబ్బతినడంతో పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రభుత్వం పెద్ద మొత్తంలో వాహనదారుల నుంచి టోల్ చార్జీలు వసూలు చేస్తున్నా.. రహదారుల గురించి పట్టించుకోవడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



సోమలదొడ్డి సమీపంలో జాతీయ రహదారిపై పడిన గోతులు



వడియంపేట వద్ద తారు లేచిపోవడంతో ప్రమాదకరంగా ఉన్న జాతీయ రహదారి

సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న నగర కార్యదర్శి శ్రీరాములు

అనంతపురం టౌన్: సాయినగర్‌లోని అస్రా ఆస్పత్రి భవనాన్ని డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ రమణరావును వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే అండతోనే డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎమ్మెల్యే అండతో అనునిత్యం అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ ఆ శాఖ అధికారులు పబ్బం గడుపుతున్నారన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన రమణరావు గతంలోనే ధర్మవరం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అనేక అక్రమాలు చేశారని గుర్తు చేశారు. నగర సహాయ కార్యదర్శి రమణ మాట్లాడుతూ.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రమణరావును జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ, అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయిస్తూ స్థానిక ఎమ్మెల్యే, అతని బావ మరిది అశోక్ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్ రమణరావుపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణుడు, అల్లీపీరా, నారాయణ స్వామి, చందుబాషా, మహిళా విభాగం జిల్లా నాయకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం వైకల్యం ఉన్నా నోటీసులిస్తారా?



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

రాప్తాడురూరల్: దివ్యాంగుల పింఛన్లలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అర్హులకు అన్యాయం చేస్తూ.. అనర్హులకు అందలం ఎక్కించేలా ఉందని ఏపీ దివ్యాంగ హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ హరినాథరెడ్డి మండిపడ్డారు. అనంతపురం రూరల్ మండలంలో అర్హులైన వికలాంగ పింఛన్లను రద్దు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం అనంతపురం రూరల్ మండలం ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట బాధితులతో కలసి ధర్నా చేపట్టారు. వంద శాతం వైకల్యం ఉన్న వారికి 40 శాతం లోపు (అర్హత ఉండదు) ఉన్నట్లు చూపించి నోటీసులు జారీ చేయడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. రూరల్ మండల పరిధిలోనే దాదాపు 900 పింఛన్లు తీసేసేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. రీవెరిఫికేషన్ అనేది బూటకం అని మండిపడ్డారు. ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించి పింఛన్ల రీ వెరిఫికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన దివ్యాంగులకు వచ్చే నెలలో పింఛన్ రాని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: పంటలు సాగు చేసిన రైతులు సస్య సంరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్.కె.లక్ష్మణ్, డాక్టర్.ఐ.భాస్కర్‌రావు, డాక్టర్.ఎం.భవాని సూచించారు. కరిడికొండ గ్రామ శివారులో వర్షాధారంగా సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది, సజ్జ పంటలను శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి కంది, ఆముదం పంటల్లో వరుసల మధ్యలో గొడ్డు సాళ్లు వేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు నివారణకు థయోమిథాక్సమ్ పురుగు మందు రెండు ఎంఎల్ చొప్పున లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. ఆముదంలో కాయకుళ్లు తెగులు నివారణకు కార్బండిజమ్ మందు ఒక గ్రాముకు లీటరు నీటిని కలుపుకొని పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయంలో సాంకేతిక సలహాల కోసం రైతులు రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డెటా రికార్డర్ సోమశేఖర్, వన్నేదొడ్డి, బాచుపల్లి, కరిడికొండ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ఒంటిమిద్ది గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బెళుగుప్ప మండలం యలవలంక గ్రామానికి చెందిన వన్నూరస్వామి బైక్‌పై ఒంటిమిద్ది గ్రామం వైపు బయలుదేరాడు. అదే సమయంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొంది. ఘటనలో వన్నూర్‌స్వామి కాలు విరిగింది. స్థానికులు వెంటనే అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

నేడు రంగనాథుడి కల్యాణం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో గురువారం మాణిక్య రంగనాథ స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా శ్రావణమాసం సందర్భంగా ఆలయ ఆవరణలో రంగనాథ స్వామికి శ్రీదేవి, భూదేవిలతో ఆనవాయితీగా కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. కల్యాణ కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హాజరవుతారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ధర్మకర్త కోరారు.

సేంద్రియంతో అధిక ‘పట్టు’ దిగుబడులు



మాట్లాడుతున్న ఆర్ఎస్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మురళి

అనంతపురం అగ్రికల్చర్: మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు వస్తాయని ప్రాంతీయ పట్టు పరిశోధన స్థానం (రీజనల్ సెరికల్చర్ రీసెర్చ్ స్టేషన్–ఆర్ఎస్ఆర్ఎస్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మురళి తెలిపారు. సెంట్రల్ సిల్క్‌బోర్డు, రాష్ట్ర పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ‘మేరా రేషం–మేరా అభిమాన్’ (నా పట్టు–నా అభిమానం) కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయ ఆవరణలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన పట్టుగూళ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం కలిగిన మల్బరీలో సేంద్రియ పద్ధతులు పాటిస్తే మరింత లాభదాయకమన్నారు. మల్బరీ మొక్కల పెంపకం నుంచి పట్టుగూళ్లు మార్కెట్‌లో అమ్ముకునే దాకా వివిధ దశలో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను వివరించారు. సమావేశంలో ఆర్ఎస్ఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, పట్టుశాఖ జిల్లా అధికారి విజయకుమార్, సెరికల్చర్ అధికారి మెహతా సుల్తానా, టెక్నికల్ అసిస్టెంట్స్ అంజనరెడ్డి, ఎస్.రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: నగర పరిధిలోని నీలిమ థియేటర్ నుంచి తపోవనం వరకూ పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతు, బ్రిడ్జి, నడిమి వంకకు రక్షణ గోడ నిర్మించాలంటూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మూడవ రోజు బుధవారం కొనసాగాయి. సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు శిబిరం ముందు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. నడిమివంకకు రక్షణగోడ లేకపోవడంతో వాహనాలు అదుతప్పి కాలువలో పడిన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మతు, బ్రిడ్జి నిర్మాణం, వంకకు రక్షణగోడ నిర్మించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేడపతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట నారాయణ, రాజు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

దిక్సూచిలా మ్యాప్ రీడింగ్



క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూడేరు: దేశ సరిహద్దుల్లో సైనికులకు మ్యాప్ రీడింగ్ ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లడానికి, గుర్తించడానికి దిక్సూచిలా పని చేస్తుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ జోబె పిలిప్ అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 9 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ–9వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. బుధవారం క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్ పై అవగాహన కల్పించారు. ఎత్తయిన కొండలు, పర్వతాల్లో ఎంచుకున్న గమ్యానికి ఏవిధంగా చేరుకోవాలి? శత్రువులపై ఏవిధంగా దండెత్తాల్లో ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు శ్రీప్రియ, ఎర్రమ్మ, సోమశేఖర్ నాయుడు, కునిందర్ కుమార్, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

‘పత్తి దిగుమతిపై సుంకం రద్దు దుర్మార్గం’



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం అర్బన్: ఎన్‌డీఏ ప్రభుత్వం పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం పత్తి రైతుల పాలిట మరణ శాసనం అని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ధ్వజమెత్తింది. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. పత్తి దిగుమతులపై సుంకాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ నిర్ణయం ఆగస్టు 19వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు వర్తిస్తుందన్నారు. ఈ నోటిఫికేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పత్తి దిగుమతిపై సుంకం రద్దుతో దేశీయ మార్కెట్‌లో పత్తి ధర పడిపోతుందన్నారు. ఫలితంగా రైతులు మరింత కష్టాలు, అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం పత్తికి ఎప్పుడూ మద్దతు ధర సి2+50 శాతం రేటు ప్రకారం ఇవ్వలేదన్నారు. మాటల్లో దేశభక్తి గురించి గొప్పగా చెప్పే నరేంద్ర మోదీ ప్రభుత్వం.. చేతల్లో దేశంలోని పత్తి రైతులకు ద్రోహం చేస్తోందని దుమ్మెత్తిపోశారు. రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతిఘటించాలని రైతులకు పిలుపునిచ్చారు.



తహసీల్దార్ కార్యాలయ ప్రహరీపై ఉన్న చెట్టు కొమ్మ



ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీపై ఇలా..

కొమ్మలు కొట్టేశారు.. వదిలేశారు

ఆత్మకూరు: ఇటీవల వీచిన పెనుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా విద్యుత్ స్తంభాలకు ఆనుకుని వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టేశారు. ఆ చెట్ల కొమ్మలు కొట్టేసి రెండు వారాలకు పైగా అవుతున్నా తొలగించ లేదు. తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆవరణలో, ఎమ్మార్సీ కార్యాలయంలో, ఆసుపత్రి లోపల, ఆసుపత్రి ప్రహరీపై కొమ్మలు అలాగే పడిపోయి ఉన్నాయి. చెట్ల కొమ్మలు ఉండటంతో చెత్తా చెదారం ఏర్పడి పాములు, విష పురుగులు సంచరించే ప్రమాదం ఉంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కొట్టేసిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

అనంతపురం: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. ఎస్కేయూలోని ఎంబీఏ విభాగంలో యాంటీ ర్యాగింగ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కంపెనీల్లో ఉద్యోగాలు కూడా దక్కవన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆంజనేయులు, ఎంబీఏ విభాగాధిపతి పి.మురళీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణుడు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం కల్చరల్: తిరుపతిలోని భారత పర్యాటక శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్తంగా పలు మేనేజ్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి, అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జ్ శివరాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్‌మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో వివిధ విభాగాల్లో కోర్సులు ఉంటాయని తెలిపారు. దేశ విదేశాల వంటకాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9701343846, 9100558006 నంబర్లలో సంప్రదించాలన్నారు.

శివరాం మృతి బాధాకరం

అనంతపురం కల్చరల్: ప్రముఖ తాత్విక గ్రంథాల రచయిత మంచిరెడ్డి శివరాం మృతి బాధాకరమని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయితలు బండి నారాయణ స్వామి, రాయుడు, బోస్, చిలుకూరి దేవపుత్ర యువకులుగా ఉన్నప్పుడు వారికి మంచిరెడ్డి శివరాం వెన్నుదన్నుగా నిలిచారన్నారు. ఆధునిక సాహిత్య విమర్శకుడిగా ఎదగడానికి ఎంతో ప్రేరణ, సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను యువతరం రచయితలు అందిపుచ్చుకోవాలని సూచించారు.

మేదర ఆడపడచులకు ఒడిబియ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక సూర్యానగర్‌లోని మల్లాలమ్మ ఆలయంలో బుధవారం జిల్లా మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో మేదర ఆడపడచులకు ఒడిబియ్యం పోశారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులు గ్రంధి రామోజీ, ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు, జిల్లా అధ్యక్షులు తమ్మినేని రామచంద్ర తదితరులు మాట్లాడుతూ.. సూర్యానగర్ సర్కిల్‌ను మల్లాలమ్మ సర్కిల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వైకుంఠరావు, బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, శోభారాణి, భాస్కర్, సంజీవ రాయుడు, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగిస్తే ఉద్యమిస్తాం

రాప్తాడు: అర్హులైన వారి పింఛన్లు తొలగించేందుకు కుట్రలు చేయడం దారుణం. షరతులు లేకుండా వికలాంగులందరి పింఛన్లు పునరుద్ధరించాలని సీపీఎం రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు, ప్రాంతీయ కమిటీ సభ్యుడు పోతులయ్య డిమాండ్ చేశారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో దాదాపు 300 మందికి వివిధ కారణాలతో పింఛన్లు తొలగించేందుకు నోటీసులు ఇచ్చారన్నారు. పింఛన్లను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల 22న రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నామన్నారు. పింఛన్‌దారులంతా వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేసు, సుబ్బారావు, ప్రతాప్, మధు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ ఏడాది వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యస్.బద్రీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటర్ వెహికల్, మెకానిక్ డీజిల్, కోప కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను మూడవ విడత కింద భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తరువాత ఒరిజనల్ సర్టిఫికెట్లను దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 26న చివరి తేదీ అని, సర్టిఫికెట్ వెరికేషన్‌కు 27వ తేదీ వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 29న అభ్యర్థులకు 29న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.